"మృత్యు కిరణాలు"

అంధవరపు మల్లిబాబు

స్ప్రింగ్ డోర్స్ తెరుచుకున్న శబ్దమయింది.

గదిలో గంభీరంగా పచార్లుచేస్తున్న సి.బి.ఐ. డైరక్టర్ శివరామ్ చిన్నగా తలతిప్పి చూసేరు.

'గుడ్ మోర్నింగ్ సర్'

స్మార్ట్‌గా సెల్యూట్ చేస్తూ లోనికొచ్చేడు సి.బి.ఐ. ఏజంట్ విహారి.

"వెరీ బాడ్ మోర్నింగ్ మై బోయ్! ప్లీజ్ టేక్ యువర్ సీట్' అని శివరామ్ తన రివాల్వింగ్ ఛెయిర్లో కూలబడ్డారు భారంగా.

శివరామ్ కెదురుగావున్న కుర్చీలో కూర్చున్నాడు విహారి.

'వాట్ హాపెండ్ సర్? ఎనీ థింగ్ రాంగ్?' అనడిగేడు విహారి.

"యుద్ధం! మళ్ళీ యుద్ధం వస్తోంది విహారీ!' అన్నారాయన దిగాలుగా.

'యుద్ధమా? ఎవరితో ఎందుకు?' విహారికాయన మాటలు అర్థంకాలేదు.

"పాకిస్తాన్‌తో! యుద్ధ సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయట." అన్నారు సి. బి. ఐ. డైరక్టర్ శివరామ్ భారంగా నిట్టూరుస్తూ.

"1965 లో అనవసరంగా మనతో యుద్ధానికి తలపడి చావు దెబ్బ తిన్న విషయం పాకిస్తాన్ అప్పుడే మరిచి పోయిందా? యు. ఎన్. ఓ. కలగజేసుకున్నందువల్ల 1965 లో పాకిస్తాన్‌ని విడిచిపెట్టడం జరిగింది. లేకుంటే పాకిస్తాన్ ఈనాడు మళ్ళీ మనతో యుద్ధానికి తలపడేది కాదు. అయినా యుద్ధవార్త మనకెలా చేరింది?"

"పాకిస్తాన్‌లో వున్న మన ఏజంట్ 222 పంపిన రిపోర్ట్స్ ద్వారా అన్ని విషయాలు తెలిసాయి."

"పాకిస్తాన్ దండయాత్రకు కారణం?"

సి. బి. ఐ. డైరక్టరు శివరామ్ గొంతు సవరించుకొని చెప్పడం ప్రారంభించేరు.

"1947 వరకు అవిరామంగా పోరాడితే మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ఆంగ్లేయులు యిండియాని వదలి పెడుతూ ముస్లిమ్స్‌కి, మనకు చీలిక పెట్టేరు. దాంతో ముస్లిమ్స్ ప్రత్యేక దేశం కావాలన్నారు. ఎందరు నచ్చజెప్పినా వినకుండా పట్టుబట్టేరు. చేసేది లేక యిండియాలో కొంత భాగం పంచి యిచ్చేరు. అదే పాకిస్తాన్!

అప్పటికి యిండియాలో అయిదు వందలకు పైగా

సంస్థానాలుండేవి. యిండియా చీలిపోతున్న తరుణంలో ప్రభుత్వం ప్రకటించింది, ఏ సంస్థానానికి ఏ దేశంలో కలవాలనుంటే ఆ దేశంలో కలిసి పొమ్మని. కొన్ని సంస్థానాలు పాకిస్థాన్‌లోనూ, కొన్ని సంస్థానాలు యిండియాలోనూ కలిసేయి.

యిండియాలో కలిసిన సంస్థానాల్లో కాశ్మీర్ ఒకటి. కాశ్మీర్ యిష్టపూర్వకంగా కలిసి పోవడానికి అంగీకరిస్తూ రాసియిచ్చిన కాయితం యిప్పటికీ మన దగ్గరే వుంది.

ఆనాటి సంస్థానాల్లో అతి పెద్దది, ముఖ్యమైనది కాశ్మీర్. అంతేగాకుండా యిండియాలోకెల్ల అత్యంత సుందరమైన ప్రదేశం. దేశదేశాల నుండి ప్రతిరోజూ వేలకొలది యాత్రికులు కాశ్మీర్‌ని సందర్శించడానికి వస్తుంటారు. దీనివల్ల దేశానికి ప్రతిఏటా కొన్నికోట్ల విలువచేసే విదేశీ మారకద్రవ్యం లభిస్తోంది.

కాశ్మీర్ పళ్ళతోటలకు ప్రసిద్ధి. పళ్ళు విస్తారంగా పండి దేశంలో నలుమూలలకు పంపగా, కొంతభాగం విదేశాలకు ఎగుమతి చేయడం జరుగుతోంది. ఈ రకంగా కూడా కొంత విదేశీ మారకద్రవ్యం లభిస్తోంది.

ముఖ్యంగా కాశ్మీర్ తేయాకు పంట ఉత్పత్తిలో ఒక ఉన్నతమైన స్థానాన్ని ఆక్రమించింది. తేయాకు ఉత్పత్తి భారతదేశపు ఆర్థిక వ్యవస్థలో ప్రధమస్థానాన్ని ఆక్రమించుకుంది. ప్రస్తుతం తేయాకు ఎగుమతుల్లో మనదే అగ్రస్థానం. అంతేగాకుండా ప్రపంచ మార్కెట్‌లో మన దేశపు తేయాకుకి-అందులోనూ కాశ్మీర్‌లో పండిన తేయాకుకి మంచి గిరాకీ వుంది. ప్రతి ఏటా తేయాకు

ఎగుమతుల వల్ల మనం ఎంతో విదేశీమారక ద్రవ్యాన్ని ఆర్జిస్తున్నాం.

కాశ్మీర్ మన దేశంలో కలిసి పోవడం వల్ల పాకిస్తాన్‌కి కన్నెర్ర అయింది ఈర్ష్యాసూయలు రగిలి, కాశ్మీర్ వలన మనకనేక విధములుగా లాభిస్తుండడం భరించలేక 1965 లో హఠాత్తుగా దండయాత్ర చేసి కాశ్మీర్‌లో కొంత భాగాన్ని ఆక్రమించుకుంది. హఠాత్తుగా మొదలైన దండయాత్ర అవి వెనుకాడక పాక్ సైన్యాన్ని చీల్చి చెండాడింది భారత సైన్యం.

ఆ పరిస్థితుల్లో యు.ఎన్.ఓ. కలగజేసుకుని, యుద్ధాన్ని నిలిపి, సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోమనీ, చర్చలు జరపమనీ కోరింది. యుద్ధం ఆగిపోయింది.

అప్పట్నుండీ పాకిస్తాన్‌లో రాజకీయ పరిస్థతులు, సాంఘిక పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉన్నందున సరయిన చర్చలు జరగలేదు. పాకిస్తాన్ ఆక్రమించుకున్న కాశ్మీర్ భాగం మనకు తిరిగి యివ్వనూలేదు. ఆ సమస్య అపరిష్కృతంగానే మిగిలి పోయింది.

ఇప్పుడు మళ్ళీ దండయాత్ర తప్పదని పాకిస్తాన్ నుండి వచ్చిన వార్తలు వింటుంటే గుండెల్లో బాంబులు బద్దలౌతున్నాయి. ఏం చేయాలో తోచడం లేదు...." ఆయాసంగా ఊపిరి తీసుకున్నారు శివరామ్‌గారు.

'పాకిస్తాన్‌తో యుద్ధానికి మనమెందుకు భయపడాలి ? 1965 లో తరిమి కొట్టినట్టుగానే మళ్ళీ తరిమేస్తాం. మన శక్తి సామర్థ్యాలు మరోసారి రుచి చూపించడమే గాకుండా 1965 లో పాకిస్తాన్ ఆక్రమించుకున్న కాశ్మీర్ భూభాగం మనం వశపరచు కుందాం" అన్నాడు విహారి

ఆవేశంగా.

సి. బి. ఐ. డైరక్టర్ శివరామ్ నిర్లిప్తంగా నవ్వేరు. 'మునుపటిలా పాక్ సైన్యాన్ని తరిమికొట్టడం ఇప్పుడు అంత సులువు కాదు' అన్నారు శివరామ్.

'ఏం ? పాకిస్తాన్‌కి ఏ దేశమన్నా వెనుక వుండి మద్దతు నిస్తుందా ?'

"కాదు ! మృత్యుకిరణాలు పేరెప్పుడైనా విన్నావా?"

'మృత్యుకిరణాలా ! నేనెప్పుడూ వినలేదే ! !'

"నువ్వేకాదు ఎవరూ వినలేదు. ఇది పాకిస్తాన్ చేస్తున్న సరికొత్త ప్రయోగం. పాకిస్తాన్‌లో ఎక్కడో పరిశోధనలు జరుపుతున్నారట. ఈ కిరణాలను రివాల్వర్ లోనూ, రైఫిల్స్‌లోనూ, టాంక్స్‌లోనూ ప్రవేశపెట్ట వచ్చునట. ఒక్కసారి ట్రిగ్గర్ ప్రెస్ చేస్తే సుమారు అయిదు వందల అడుగుల దూరం ప్రసరితమై, దాదాపు వేయిమందిని హతమారుస్తుంది. పాకిస్తాన్‌లోని మన ఏజంట్ 222 ఈ విషయాన్ని రిపోర్ట్ పంపించేడు."

'మైగాడ్ !' అన్నాడు విహారి ఆశ్చర్యపోతూ.

'ఈ లెక్కన చూస్తే మన భారత సైన్యం నామ రూపాల్లేకుండా అయిపోవడానికెంతో సేపు పట్టదు. రెండు సార్లు మన చేతిలో చావుదెబ్బ తిన్నా మళ్ళీ మన మీద పాకిస్తాన్ యుద్ధాన్ని ప్రకటిస్తుందంటే, ఆ మృత్యు కిర ణాలే కారణం !'

విహారి ఆలోచిస్తూ మౌనంగా తలూపేడు.

"దేశం కోసం మరో సారి తెగించి పాకిస్తాన్ వెళ్ళ గలవా విహారీ !" అడిగేరు సి. బి. ఐ. డైరెక్టర్ శివ రామ్.

'నా దేశంకోసం ఏం చేయడానికైనా, ఎక్కడికి వెళ్ళడానికైనా వెనుకాడను. పాకిస్తాన్ వెళ్ళడానికి నేను సిద్ధం. నేనేం చేయాలో చెప్పండి.'

'పాకిస్తాన్ వెళ్ళి, 'మృత్యుకిరణాలు' పరిశోధన ఎక్కడ జరుగుతున్నాయో తెలుసుకుని, ఆ లేబరేటరీని నాశనం చేసిరావాలి. నువ్వు పాకిస్తాన్‌కి విహారిగా కాక అన్వర్ హుస్సేన్ పేరుతో ఓ యాత్రికుడిగా వెళతావ్. పాస్‌పోర్టు వగైరా ఏర్పాట్లు ఈ క్షణమే ప్రారంభిస్తాను. ఒన్ థింగ్ యు మస్ట్ నో. పాకిస్తాన్‌లో ఏం జరిగినా భారతదేశం నుంచి ఎటువంటి సహాయం లభించదు. యు మస్ట్ టేక్ యువర్ ఓన్ రిస్క్ ఇన్ పాకిస్తాన్" అని ముగించేరు డైరెక్టర్ శివరామ్.

"ఆల్‌రైట్! ఎప్పుడు బయల్దేరాలి?"

"ఆలస్యం చేస్తే, ఎప్పుడే ప్రమాదం ముంచుకొస్తుందో! మరో రెండు గంటల్లో నీకు కావలసిన ఏర్పాట్లన్నీ చేయబడతాయి. బైదిబై, నువ్వు పాకిస్తాన్ వస్తున్న విషయం మన ఏజంట్ 222 కి తెలియజేస్తాను. అతన్ని కలుసుకుంటే ఆ లేబరేటరీ ఎక్కడున్నదీ, దాని వివరాలూ నీకు క్షుణ్ణంగా తెలిసే అవకాశముంటుంది."

విహారి తలూపేడు.

"పాకిస్తాన్ గూఢచారులు గుంటనక్కలు. పరమ కర్కోటకులు. జాగ్రత్త. ఈ ప్రయత్నంలో అనుకోనిది జరిగితే యు. ఎన్. ఓ. ముందు యిండియా అపరాధిలా నిల్చోవాల్సి వుంటుంది. కనుక నువ్వు ఎట్టి పరిస్థితుల్లోనూ పట్టుబడరాదు. నౌ, యు కెన్ గో"

విహారి ఉత్సాహంగా బయటికి నడిచేడు.

2

ఇస్లామాబాద్!

పాకిస్తాన్ రాజధాని!!

ఎయిర్‌పోర్ట్‌లో రాజహంసలా వాలింది యిండియన్ బోయింగ్. లాడర్ ఎటాచ్ చేయబడింది. తలుపు తెరవబడ్డాక, ఎయిర్ హోస్టస్ లాడర్ స్టెప్స్ ముందు నిల్చుని దిగిపోయే ప్రయాణీకులకు చిరునవ్వుతో వీడ్కోలు చెప్తోంది.

విహారి బ్రీఫ్‌కేస్ తీసుకుని స్టెప్స్ మీదుగా క్రిందికి దిగి, కస్టమ్స్ ఆఫీసులో అడుగుపెట్టేడు. అది అంతర్జాతీయ విమానం కావడంవల్ల అరగంట పాటు 'సివియర్' చెకింగ్ జరిగింది.

చెకింగ్ పూర్తయ్యేక, బయటికి వచ్చి చుట్టూ చూస్తూ నిలుచున్నాడు. ఏజంట్ 222 అతనికెక్కడా కనిపించ లేదు. ఏమయ్యేడు? ఎందుకు రాలేదు? తను వస్తున్న వార్త అతనికి చేరలేదా? లేక అతనేదైనా ప్రమాదంలో యిరుక్కున్నాడా?

"హల్లో హుస్సేన్‌జీ!" అని పిలిచేరెవరో.

వెనక్కి తిరిగేడు విహారి.

ఎదురుగా పాకిస్తాన్ యింటలిజెన్స్ డిపార్ట్‌మెంట్‌లో ప్రముఖుడు, ఆరితేరిన గూఢచారి అయిన ముజద్దర్ ఖాన్! అదిరిపడ్డాడు, అతన్ని గుర్తుపట్టి!

విహారి గుండె దడదడలాడింది.

ముజద్దర్ ఖాన్ తనను పోల్చుకున్నాడా? ఎలా? తను విహారిగా కాక ముస్లిమ్ వేషంలో వున్నాడు.

పైజామా, షర్వానీ, పిల్లిగడ్డం, తుపాక వాళ్ళు ధరించే టోపీ, గిల్టు ఫ్రేమున్న కళ్ళ జోడు, ఫ్రెంచ్ కట్ మీసాలు-ఈ వేషంలో తననెవరూ గుర్తుపట్టలేరు. మరి తననెందుకు పిలిచినట్టు? మొదటి మెట్టులోనే తను పట్టు బడి పోతున్నాడా? అనేక ప్రశ్నలు కదిలేయి విహారి మస్తిష్కంలో.

తన ఆందోళనను, మస్తిష్కంలో కదులుతున్న ఆలోచనల్ని బయటికి కనిపించనివ్వకుండా 'హల్లో!' అన్నాడు విహారి.

"అయామ్ ముఖ్దర్ ఖాన్!" అన్నాడతను క్లుప్తంగా 'మీ పేరుతో నాకో ఫ్రెండ్ వుండేవాడు. అందుకే ఎయిర్ పోర్ట్ ఆఫీస్ లిస్టులో మీ పేరు చూసి మిమ్మల్ని పిలిచేను. ఐయామ్ వెరీ హేపీ టూ సీ యూ' అన్నాడు ముఖ్దర్ ఖాన్ చెయ్యి చాచుతూ.

"అయామ్ ఆల్ సో వెరీ హేపీ టు సీ యూ సర్. ఇక నుండి నేను కూడా మీ స్నేహితుడ్నే-" షేక్ హాండిస్తూ అన్నాడు విహారి.

"మీరు పాకిస్తాన్ రావడం యిదే తొలిసారా?" అనడిగేడు ముఖ్దర్ ఖాన్.

"అవున్సార్? నా పూర్వీకులందరూ ఈ పాకిస్తాన్ లోనే బ్రతికేరు. వాళ్ళు వున్నటువంటి పాకిస్తాన్ ఎలా వుంటుందో చూడాలని వచ్చేను," అన్నాడు.

"అచ్ఛా! హుస్సేన్ జీ.....మిమ్మల్నెక్కడో చూసినట్టుంది. మీరిదివరకు పాకిస్తాన్ రాకపోవడం నిజమేనా?"

విహారి గుండె దడదడలాడింది. తనను పోల్చినట్టు నాటక మాడుతున్నాడా?

'లేదు సార్। పాకిస్తాన్ నేనింతకు ముందెప్పుడూ రాలేదు. మనిషిని పోలిన మనుషులుంటారంటారు. మీ విషయంలో అదే జరిగివుంటుంది.'

'ఆల్‌రైట్! సీ యూ ఎగైన్ హుస్సేన్ జీ?' అని చెప్పి వెళ్ళి పోయేడు ముఖ్దర్ ఖాన్.

ఎయిర్‌పోర్ట్ బయటికి రాగానే టాక్సీ డ్రైవర్స్ చుట్టు ముట్టేశారు విహారిని.

"మంచి హోటల్ ఏది?" అడిగేడు విహారి, ఓ టాక్సీ డ్రైవర్‌ని పాకిస్తాన్ భాషలో.

"గుల్‌బర్గ్।" టక్కున సమాధాన మిచ్చేడతను.

విహారికి 'గుల్‌బర్గ్' గురించి తెలుసు. ఆ మాటకొస్తే పాకిస్తాన్‌లో ఎక్కడేం వుందో విహారికి తెలియని విషయం కాదు. కాని తొలిసారిగా పాకిస్తాన్ చూడ్డానికి వచ్చినట్టుగా వుండాలంటే, తన మీద కన్ను వేసివుంచిన పాకిస్తాన్ ఏజంట్స్‌కి అనుమానం రాకుండా వుండాలంటే ఆ మాత్రం నటించక తప్పదు.

స్తంభం చాటున నిలబడి తనను గమనిస్తున్న ముఖ్దర్ ఖాన్‌ని గమనించేడు విహారి.

"గుల్‌బర్గ్। అయితే, ఆ హోటల్‌కి పద।" విహారి డోర్ తెరిచి, లోపల కూర్చున్నాడు.

టాక్సీ కదిలింది. ఇస్లామాబాద్ వీధులు విశాలంగా వున్నాయి. అక్కడి ప్రజలు, వాతావరణం విచిత్రంగా వుంది. భుట్టో మరణం తర్వాత అక్కడకూడా చిన్న సైజు తిరుగుబాట్లు లేస్తున్నాయి. వాటిని అణిచివేయ డానికి ప్రభుత్వం మిలటరీని దించి, నలుమూలలా వుంచి తగిన జాగ్రత్తల్ని తీసుకుంటోంది. ఎక్కడేది జరిగినా

వెంటనే కాల్చిపారేయమని ప్రభుత్వ ఉత్తర్వు.

హోటల్ 'గుల్‌బర్గ్' ముందాగింది టాక్సీ.

3

"వెల్ మిస్టర్ విహారీ! నువ్వు పాకిస్తాన్ వస్తున్నట్టు శివరామ్‌గారు పంపిన మెసేజ్ అందినది. పాకిస్తాన్ ఏజంట్ల కన్నుగప్పి, ఈ మట్టిమీద అడుగు పెట్టడం మృత్యువుతో పోరాటం వంటిది. అయినా, అది నీకు మంచినీళ్ళ ప్రాయమే! నిన్ను అభినందించక తప్పదు" ప్రశంసాపూర్వకంగా భుజం తడుతూ అన్నారు భారత రాయబారి.

విహారి యిప్పుడు ముస్లిమ్‌వేషంలో లేడు ఎందుకైనా మంచిదని రిటైర్డ్ మిలటరీ ఆఫీసర్‌గా వేషం మార్చు కున్నాడు. బొద్దుమీసాలు, సిగార్ పైప్, హేండ్ స్టిక్, ఖాకీరంగు యూనిఫారమ్, తలపైనున్న కేప్-పొరపాటున కూడా ఎవరూ పోల్చలేరు.

"మృత్యువుతో పోరాటం అయినా, ప్రాణాలతో చెలగాటమైనా దేశం కోసం రాకతప్పదు కదా?" అన్నాడు విహారి చిరునవ్వుతో.

"అయ్ నో మై బోయ్! నా వలన నీకు కావలసిన సహాయమేమిటి?" అడిగేరు భారత రాయబారి.

"మృత్యుకిరణాలు గురించి విన్నారా?"

"ఏజంట్ 22! రెండు మూడుసార్లు నాతో వాటి గురించి మాట్లాడేడు. కాని వాటి గురించి అతనికి తెలిసి నంత బాగా నాకు తెలియదు"

"మృత్యు కిరణాలు లాబరేటరీ ఎక్కడుందో కూడా తెలియదా?"

తల అడ్డంగా వూపేరాయన. "నాకే కాదు. ఏజంట్ 222 కూడా నిర్దిష్టంగా తెలిసినట్టులేదు."

"ఏజంట్ 222 ఎక్కడ? అతనికి నేను వస్తున్న వార్త తెలుసా?"

"తెలియకేం. నువ్వు వస్తున్నట్టు వార్త అందిన రోజునే మా యిద్దరం కలుసుకున్నాం. నీ రాక అతనికి చెప్పేను. చాలా ఆనందపడ్డాడు. నువ్వు రావడానికి పూర్వమే మృత్యుకిరణాలు 'లాబ్' ఎక్కడుందో తెలుసుకుని, ఆ తర్వాత పనిని నీ చేతిలో పెట్టి తను నిశ్చింతగా నిద్రపోతానని బయల్దేరేడు. కానీ, ఆ రోజు తర్వాత అతను మళ్ళీ నన్ను కలియలేదు."

"కారణం ?"

"అతను శత్రువులకు చిక్కిపోయి వుంటాడు! రెండురోజుల కోసారి కలుసుకునే ఒప్పందం మా మధ్య ఉంది. అతను వెళ్ళి రెండ్రోజులు దాటింది. అతనిప్పటికీ రాకపోతే అలాగే అనుకోవాల్సి వస్తుంది."

మై గాడ్! ఏజంట్ 222 శత్రువులకు చిక్కిపోయేడా? పాకిస్తాన్ ఏజంట్ల చేతిలో చిక్కుకోవడమంటే ప్రత్యక్ష నరకమన్నమాట. యిప్పుడెలా? మృత్యు కిరణాలు లాబ్ ఎక్కడుందో తెలుసుకోవడమెలా?

"ఏజంట్ 222 ఎక్కడ వుండేవాడు?"

"అతను చేసే ప్రతిపని డైరీలో వ్రాసుకుంటాడు. ఆ డైరీ నా దగ్గరే వుంటుందెప్పుడు. తను తెలుసుకున్న ప్రతి విషయాన్నీ అందులో రాసుకుని, తర్వాత నాకు

డైరీ తిరిగి యిచ్చి వెళ్లాడు. ఇదే ఆ డైరీ !" జేబు లోంచి తీసి విహారి చేతిలో పెట్టేరు భారత రాయబారి.

విహారి డైరీ అందుకుని, పేజీలు తిరగేసేడు.ఏజంట్ 222-

'మృత్యుకిరణాలు' లాబ్ తెలుసుకోవడాన్ని గురించి అతను చేస్తున్న ప్రయత్నాలన్నీ కోడ్‌లో ఉన్నాయి. కాని అతని ప్రయత్నం ఫలించినట్టు ఎక్కడా లేదు.

"విహారీ! ఎక్కువసేపు మనం మాట్లాడుతూ కూర్చో వడం బాగుండదు. శివరామ్‌గారు నీకివ్వమన్న పాకిస్తాన్ కరెన్సీ యిదిగో. అవసరమైతే మళ్ళీ అడుగు" అని జేబులోంచి కొంత కరెన్సీని అందించేరు.

విహారి జేబులో పెట్టుకున్నాడు. ఏజంట్ 222 గాని మళ్ళీ కలిస్తే తన ఉనికిని తెలియజేసి కలవమని చెప్ప మని చెప్పాడాయనతో.

4

మధ్యాహ్నం.

టాక్సీలోంచి దిగి, గుల్‌బర్గ్ లోనికి నడిచేడు విహారి

'హాయ్ స్వీటీ !' అంటూ రిసెప్షనిస్టు రాజీని విష్ చేసేడు.

"హుస్సేన్ జీ ! ఎలావుంది మా హోటల్ ? సదుపాయాలన్నీ బాగున్నాయా ?" రాజీ పలకరిస్తూ అడిగింది ఫార్మాలిటీగా.

నవ్వుతూ తలూపి, మెట్లు మీదుగా పైకి వెళ్ళసాగేడు విహారి. రూమ్ 'కీ' చైను గిర్రున తిరుగుతూ అతని చూపుడు వేలిని చుట్టుకుంటోంది.

మేడ మెట్లు అంతమయ్యేయి. కారిడార్ మీద నడుస్తూ రూమ్ ముందుకి వచ్చేడు విహారి.

రూమ్ తలుపులు తీసివున్నాయి.

లోపల లైటు వెలుగుతోంది.

తారిం చెవి తన దగ్గరుండగా రూమ్ తలుపెవరు తెరిచేరు? తన అనుమతి లేకుండా అందులో అడుగు పెట్టడానికంత ధైర్యం ఎవరికుంది?

తలుపు తట్టి మెల్లగా లోనికి నెట్టేడు.

శబ్దం లేకుండా తలుపు వెనక్కి వెళ్ళి పోయింది.

మనిషి మాత్రుడెవడూ కనిపించలేదు రూమ్‌లో.

ఆశ్చర్యపోయేడు.

అంతకు ముందు ఆ రూమ్‌లో ఎవరో తిరిగినట్లుగా గుర్తులు కనిపిస్తున్నాయి. బ్రీఫ్‌కేస్ తెరిచి వుంది. అందులోని బట్టలు బయట మంచం మీద పడివున్నాయి. ఒకటి రెండు సిగరెట్ పీకలు మంచం క్రింద చోటు చేసుకున్నాయి. అంటే లోనికి వచ్చిన వాళ్ళు దేనికోసమో వెదికేరన్న మాట. తనను అనుమానించేరా? తనెవరో తెలిసి పోయిందా? బహుశా తనను పట్టిచ్చే వివరాలేవీ వారికి దొరికి వుండవు. ఉంటే తనసీ పాటికి పాకిస్తాన్ బలగం చుట్టిముట్టి వుండేది.

లోనికి వెళ్ళి, బాత్ రూమ్ తలుపులు తెరిచి చూసేడు.

బాత్ రూమ్ శూన్యంగా కనిపించింది వెక్కిరిస్తూ.

లోనికొచ్చిందెవరు? పాకిస్తాన్ అధికారులా? దొంగ తనానికెవరేనా లోపల ప్రవేశించేరా?

దొంగ తనానికైతే తన బ్రీఫ్‌కేస్‌లో వున్న విలువైన బట్టలేవీ ఎందుకు తీసుకెళ్ళ లేదు? సందేహం లేదు.

ఎవరో తనను అనుమానించేరు. ఎవరు? ముఖద్దర్ ఖానా!

అలోచిస్తుండగానే వెనుక చప్పుడయింది.

గిర్రున తిరిగేడు.

ముఖద్దర్ ఖాన్!

డోర్ దగ్గర విలాసంగా నిలబడి, చిరునవ్వునవ్వుతూ చూస్తున్నాడు.

'హలో హుస్సేన్ జీ! ఏమిటలా వున్నారు?' అనడిగేడు ముఖద్దర్ ఖాన్.

'నా గదిలో ఎవరో దొంగలు పడ్డారు. తాళం చెవులు నా దగ్గరుండగా, పరాయివారు గదిలోనికెలా వచ్చేరో తెలియడంలేదు. రిసెప్షనిస్టు రాజీ ఏం సంజాయిషీయిస్తుందో చూడాలి'

"రాజీకి మాత్రం ఏం తెలుస్తుంది హుస్సేన్ జీ! ఈ రోజుల్లో దొంగ ఎవరో దొర ఎవరో తెలియడంలేదు. కాస్త వేషం మారిస్తే చాలు-"

విహారి గతుక్కుమన్నాడు.

ముఖద్దర్ ఖాన్ తనను గుర్తించేడా?

"పరదేశీయుని రూమ్‌లో యిలాంటి దొంగతనం జరగడం, అనుమతి లేకుండా డూప్లికేట్ 'కీ' తో గదిలో ప్రవేశించడం పాకిస్తాన్ ప్రభుత్వానికే అవమానం. నేను ఈ విషయాన్ని రేపే పాకిస్తాన్ ప్రధానికి తెలియజేస్తాను"

పగలబడి నవ్వేడు ముఖద్దర్ ఖాన్.

అతనెందుకు అంతగా నవ్వుతున్నాడో, తన మాటల్లో అంతగా నవ్వాల్సిందేముందో తెలియలేదు విహారికి. ముఖద్దర్ ఖాన్ వేపు విస్మయంగా చూసేడు.

'గుడ్! పులి నేరుగా బోనులోకే వస్తుందంటే ఎవరికి

మాత్రం సంతోషం కాదు. బట్, నాకో చిన్న సందేహం. మీరు మా ప్రధానిని కలుసుకునేది అన్వర్ హుస్సేన్ గానా? యిండియన్ ఏజంట్ విహారి గానా?"

అదిరి పడ్డాడు విహారి.

ముఖద్దర్ ఖాన్ కి యీ రహస్యం ఎలా తెలిసింది? తను పాకిస్తాన్ బయల్దేరిన విషయం డైరెక్టర్ శివరామ్ గారికి తప్ప వేరొకరికి తెలియదు. అంత రహస్యంగా ఏర్పాట్లు జరిగినా, తన గురించి తెలుసుకున్నారంటే ఏదో జరిగి వుండాలి.

'ఎలా తెలిసిందని బుర్ర బద్దలు కొట్టుకుంటున్నావా విహారీ?' అదేదో పెద్ద జోకులా పెళ్లున నవ్వేడు మళ్ళీ!

"పాకిస్తాన్ ఏజంట్లు చచ్చుదద్దమ్మలు కారు. దేశంలో ఎక్కడ, ఏది జరిగినా వెంటనే తెలుసుకుని వార్తలు పంపిస్తూ వుంటారు. ఇండియాలో వున్న మా ఏజంట్లు ఢిల్లీలో నువ్వు బయల్దేరినవెంటనే సమాచారాన్ని అందించేరు. అయితే, నువ్వు దిగిన ఫ్లైట్ లో నుండి నీలాగే ముస్లిం వేషంలో ముగ్గురు దిగేరు. ఆ ముగ్గురులో ఎవరు "విహారి" అన్నది తేల్చడం నాకు కూడ కష్టమై పోయింది. మా ఏజంట్లు ముగ్గురినీ ఫాలో అయ్యేరు. ఆఖరికి ఈరోజు నువ్వు భారత రాయబారిని కలుసుకోవడంతో 'నువ్వే యిండియన్ స్పై' అని తేలిపోయింది" ముఖద్దర్ ఖాన్ కేప్ సర్దుకుని, జేబులోంచి చటుక్కున రివాల్వర్ తీసి పట్టుకున్నాడు.

అప్పుడే లోపలికి వచ్చిన నలుగురు పోలీసులు కూడా తనకేసి తుపాకులు గురిపెట్టి నిలుచున్నారు.

విహారి గుండె వదవద లాడింది.

అప్పుడే తను పట్టుబడి పోతున్నాడా ? శత్రువుల చేతికి చిక్కిపోయినట్టేనా ? పాకిస్తాన్‌కి చిక్కితే తన శవం కూడా యిండియా చేరదు.

మెరుపులా దూకి పారిపోవాలనుకున్నాడు. కానీ, విహారి ఆలోచనలు ముఖద్దర్ ఖాన్ చదివినట్లుగా వుంది.

'ఠైరో !' దిక్కులు పిక్కటిల్లేలా అరిచేరు. ఇక సహించలేక పోయేడు విహారి. సాహసిస్తే ఒళ్ళు తూట్లు పడక తప్పదని తెలుసతనికి.

'పారిపోవాలని ప్రయత్నించకు. నీ ప్రాణాలు తీయడం మాకు పెద్ద సమస్య కాదు. కానీ, నిన్ను యు. ఎన్. ఓ. ముందు హాజరు పరచి....'

"హరికథలు చెప్పకు ముఖద్దర్ ఖాన్. నీ పనికానియ్!'

శత్రువు మృత్యువులా ఎదుట నిలబడివున్నా చెక్కు చెదరని గుండెనిబ్బరంతో మాట్లాడుతున్న విహారిని చూస్తుంటే ముఖద్దర్ ఖాన్‌కి ఒళ్ళు మండుకొస్తోంది.

పోలీసులకు సైగచేసేడు ముఖద్దర్ ఖాన్. ముగ్గురు పోలీసులు విహారిని చుట్టుముట్టి సంకెళ్ళువేసి జీపెక్కించేరు.

5

ఎత్తయిన ఘాటీ!

కొండ చుట్టూ తిరుగుతూ కిందకు దిగుతోంది పోలీస్ జీప్. జీప్‌లో డ్రైవరు ప్రక్కన ముఖద్దర్ ఖాన్ కూర్చు న్నాడు. కానిస్టేబుల్స్ విహారికి రెండు ప్రక్కలా సర్దు కున్నారు.

టైమ్ ఆరు గంటలయింది. శీతాకాలం కావడంవలన తొందరగానే చీకటిపడింది.

కొండమీదునుంచి విద్యుద్దీపాల వెలుగుతో సుందరంగా కనిపిస్తోంది ఇస్లామాబాద్ నగరం. చెట్లు చిన్నవిగా మనుషులు చీమల్లా కనిపిస్తున్నారు. వాహనాలు అగ్గిపెట్టెల్లా కదులుతున్నాయి.

విహారి ఆలోచనలో పడ్డాడు.

ముజఫ్ఫర్ ఖాన్ తనను చంపాలనుకోవడం లేదు. అతని ఆలోచనేమిటో అంతుబట్టడం లేదు. తనను యు. ఎన్. ఓ. ముందు ఏదో నేరంమోపి నిలబెట్టడానికేనా? లేక ఇంకేదైనా ప్రయోజనాన్ని ఆశించి చేస్తున్నాడా? పై అధికారుల నుంచి అనుమతిలేదా?

సి బి.ఐ. డైరక్టర్ శివరామ్‌మాటలు గుర్తుకొచ్చాయి విహారికి.

యస్! తను పట్టుబడ కూడదు. ఎలాగైనా తప్పించుకోవాలి. కాని ప్రాణాలతో పట్టుబడ కూడదు. తనను ఆసరాగా తీసుకుని, తన దేశంమీద దుమ్మెత్తి పోయాలని పీరుచేస్తున్న కుట్ర కొనసాగడానికి వీల్లేదు.

కాని, తప్పించుకోవడం ఎలా?

తనకు రెండు ప్రక్కలా కూర్చున్న కానిస్టేబుల్స్ అప్రమత్తతతో మెలగుతున్నారు. చిన్నశబ్దం అయినా చటుక్కున పసిగడుతున్నారు. దానికితోడు తనప్రత్యర్థి ముజఫ్ఫర్ ఖాన్ ముందున వుండనే వున్నాడు. అతన్ని మోసగించి తప్పించుకోవడం చిన్నవిషయంకాదు.

జీప్ మలుపు తిరుగుతున్నప్పుడు దూకితే!

గుండె జల్లుమంది విహారికి, ఆ ఆలోచన రాగానే. పొరపాటున రోడ్డు అంచుకు జారితే పోల్చుకోడానికి ఎముకలు కూడా మిగలవు. ఎలా? పోనీ, ఘాటీ పూర్తయ్యేక దూకాలనుకుంటే జనసంచారం వున్నచోట అసలే వీలుపడదు.

ఏదో చేసేయాలి! తప్పించుకుని తీరాలి!!

జీప్ టాప్ వేపు చూసేడు. ఆ జీప్‌కి టాప్ లేదు.

తప్పించుకునే మార్గం కోసం ఆలోచించేడు. బూటు అడుగున దాచిన మినీ గ్యాస్ బాంబు గుర్తుకొచ్చింది.

చేతులు కదిపితే అనుమానిస్తారేమో!

కాలు మీద కాలు వేసుకుని బూటు అడుగున వున్న డిప్ప మీద 'లయ' వేస్తున్నట్లుగా శబ్దం చేయసాగేడు. కానిస్టేబుల్స్ ఓమారు చూసి దృష్టి మార్చుకున్నారు. అదే అవకాశాన్ని ఉపయోగించుకున్నాడు విహారి

ఒక వేపు శబ్దం చేస్తునే మినీగ్యాస్ బాంబు బయటకి తీసి చటుక్కున పళ్ళతో బిడిపెను బయటకు లాగి, ఊపిరి బిగించేడు విహారి.

గ్యాస్‌బాంబు తన పని కానిచ్చింది.

జీప్‌నిండా గ్యాస్ అలుముకుంది.

"వాటీజ్ దిస్?" అంటూ వెనక్కి తిరగ బోయిన ముఖద్దర్ ఖాన్‌కి స్పృహతప్పింది.

అందరు స్పృహ తప్పి పోతుండగా, విహారి జీప్‌లో నుంచి క్రిందకి దూకేడు. కాని డ్రైవర్ చేతి నుండి స్టీరింగ్ కంట్రోల్ తప్పి పోవడం వలన, జీప్ అటు యిటూ, ఊగుతున్న సమయంలో విహారి దూకడంతో రోడ్డు మీదకు దూకాలన్న అతని అంచనా తప్పింది.

రోడ్డు మీద దొర్లాల్సిన శరీరం గాలిలో తేలుతూ లోయ లోకి జారిపోయింది.

జీప్ కొంచెం ముందుకు వెళ్ళి, మలుపులో కొండకు ఢీకొని ఆగిపోయింది.

6

కళ్ళు తెరిచేడు విహారి.

అటు యిటూ చూసేడు. తనిప్పుడు ఎక్కడున్నది గుర్తుకు రాలేదు. కొని క్షణాల తర్వాత జ్ఞాపకం వచ్చింది తను కొండమీద నుంచి లోయలోకి జారిపోవడం.

అది గుర్తు రాగానే ఒళ్లు ఝల్లుమంది. అంత ఎత్తు నుంచి పడినా తనింకా బ్రతికి వున్నాడంటే ఆశ్చర్యమే. ఎవరు తననిక్కడకు తీసుకువచ్చేరు?

ముఖద్దర్ ఖాన్ తనను బంధించి, జీప్‌లో తీసుకు రావడం... మిసీగ్యాస్ బాంబు తీయడం.... జీప్‌లో నుంచి దూకడం.... అన్నీ ఒకొక్కటీ గుర్తుకొస్తున్నాయి విహారికి.

మంచం మీద నుంచి లేవబోయేడు. కాని కాళ్లూ, చేతులు అతనికి సహకరించలేదు. తలకు బాండేజ్ వుంది. కాళ్ళకు చేతులకూ వుంది. అంటే బలమైన గాయాలు తగిలి వుండాలి. తనను ఎవరు కాపాడేరు? ఎవరు చికిత్స చేసేరు? అసలెవరూ కనిపించరేం?

అడుగుల చప్పుడు వినిపించింది.

తలతిప్పి చూసేడు విహారి.

ఓ యువకుడు నిలబడి వున్నాడు

'హమ్మయ్య! ఇప్పటికి స్పృహ వచ్చిందన్నమాట

మీకు' అన్నాడతను లోనికొస్తూ.

అతను దృఢంగా వున్నాడు. పంచె, లాల్చీ ధరించేడు. లాల్చీపైన చేతులులేని ఉన్నికోటు వేసుకున్నాడు. వయసు ముప్పై దాటుతుంది.

విహారి అతని వేపు చూసి 'మీ రెవరు? నేనిక్కడి కెలా వచ్చేను' అనడిగేడు.

'భయపడకండి. నేను మీకు మిత్రుడ్నే!' అని చెప్పేడతను.

విహారికి అంతా అయోమయంగా వుంది. అతనెవరో, అంత ఎత్తునుంచి దూకిన తనెలా బ్రతికాడో ఏమీ అర్థంగావడంలేదు. చేతులు చూసుకున్నాడు. సంకెళ్ళులేవు.

'నా చేతికున్న సంకెళ్ళు....'

'ఆ సంకెళ్ళే మీ ప్రాణాలు కాపాడేయి'

అదిరి పడిపోయేడు విహారి. 'సంకెళ్లు నా ప్రాణాలు కాపాడేయా? అదెలా?'

'నూటికి నూరుపాళ్లా నిజం. నేను మూలికల ద్వారా ఔషధాలు తయారు చేస్తుంటాను. నా పేరు రహమత్ ఖాన్. రెండ్రోజుల క్రితం మూలికలను ఘాటీల్లో అన్వేషిస్తుంటే రాళ్ళమీద నుండి జరజర జారుతున్న చప్పుడు వినబడి పైకి చూసేను. ఓ మానవ దేహం పైనుండి దొర్లుతూ వచ్చి ఓ చెట్టుమీద బడింది. సంకెళ్లు చెట్టు కొమ్మల్లో చిక్కడిపోయినందువల్ల అక్కడితో దొర్లడం ఆగిపోయింది. నేను పరిగెత్తి కెళ్ళి మిమ్మల్ని అతికష్టం మీద నేల మీదకు దించి, యింటికి తీసుకు వచ్చేను. మీకు బలమైన గాయాలు తగలడంవల్ల రెండ్రోజులున్నుండీ స్పృహలేదు" చెప్పాడతను.

'మీకు నా కృతజ్ఞతలు ఎలా తెలియ జేయాలో తెలియడంలేదు. దయ, జాలి లేనిదో మానవజాతే అంత రిస్తుంది. పాకిస్తాన్ ప్రజలలో దయ, జాలి అనేవి ఉండ వనుకున్నాను. మీ మేలు ఎన్నటికీ మరువలేను,' విహారి పొగిడేడు.

'ఎక్కువ పొగడకండి తోటి మానవుడు కష్టాలో వుంటే ఆదుకోవడం గొప్ప విషయంకాదు. నా ధర్మం నిర్వర్తించినందుకు నాకెంతో సంతోషంగా వుంది. మీ రెవరు?' అడిగేడతను.

'నేను భారతీయుణ్ణి'

'ఎందుకీ దేశం వచ్చేరు?"

విహారి సందేహించేడు.

'చెప్పండి. పర్వాలేదు. నేను పాకిస్తాన్ మనిషయినా నా పూర్వీకులు ఇండియాలోనే పెరిగేరు. వలస వచ్చిన వారి సంతతివి నేను. నాలోనూ మీ దేశం రక్తం ప్రవహిస్తోంది. చేతనయితే మీకు సహాయం చేస్తాను' అని చెప్పాడతను.

'నేను యిండియన్ సి. బి. ఐ. ఏజంట్. నా పేరు విహారి' చెప్పేడు.

విహారి వూహించినట్టు అతను ఆశ్చర్యపోలేదు "మీరు ఎందుకు ప్రమాదంలో చిక్కుకున్నారు?"

విహారి అంతా చెప్పాడు.

7

విహారికి గాయాలు తగ్గుముఖం పట్టేయి. లేచి నిల బడ గలుగుతున్నాడు. కాని, కాస్త నీరసంగా వున్నాడు.

అతను వెళ్ళిపోతానన్నా, రహమత్‌ఖాన్ ఒప్పుకోలేదు.

"ఒంట్లో ఎలా వుంది భాయ్ ?" కాఫీ అందిస్తూ అన్నాడు రహమత్‌ఖాన్.

"బాగానేవుంది. కానీ ప్రశాంతంగా సాగుతున్న నీ బ్రతుకులో అల్లకల్లోలాన్ని సృష్టిస్తానేమో అని అనుమానంగా వుంది. ప్రత్యర్థులు అఖండమైన తెలివి గలవాళ్ళు. లోయలో నా శవం కనబడక పోవడంతో, వాళ్ళు తప్పకుండా నేను బ్రతికివున్నట్టు తెలుసుకుంటారు. ఏదో విధంగా వాళ్ళు తెలుసుకుని ఇక్కడికి వస్తే నా వలన నువ్వు చాలా కష్టాలకు గురికావలసి వుంటుంది. అందుకే నేను ఈ రోజు వెళ్ళిపో దలచుకున్నాను.' అన్నాడు విహారి.

'పూర్తి స్వస్థత చేకూరకముందు ఎక్కడికి వెళ్ళగలవు ? నీకా భయం అక్కర్లేదు. నువ్వు యిక్కడున్న సంగతి ఎవరూ తెలుసుకోలేరు.' ధైర్యం చెబుతూ అన్నాడు రహమత్‌ఖాన్.

విహారి కాఫీ త్రాగి, సిగరెట్ వెలిగించేడు.

అంతవరకూ ప్రశాంతంగా వున్నవీధి కోలాహలంగా మారింది.

"ప్రతి ఇంటినీ సోదా చేయండి. అనుమానం తగిలితే కాల్చిపారేయండి." ఉరుములాంటి గొంతు వినిపించింది రహమత్‌ఖాన్‌కి.

విహారికి ఆ గొంతు వినగానే గుండె దడదడలాడింది. ఆ గొంతును గుర్తుపట్టలేని అమాయకుడు కాదు విహారి. అది పాకిస్తాన్ యింటలిజన్స్ ఏజంట్ ముజఫర్‌ఖాన్ గొంతు !

రహమత్ ఖాన్ కిటికీతలుపు తెరిచి బయటకి చూసి, మళ్ళీ వెంటనే తలుపు మూసి పరిగెత్తుకొచ్చేడు.

'బాప్ రే! పదిమంది సోల్జర్స్!! వాళ్ళతో పాటు ఓ ఆఫీసరు వున్నాడు. వాళ్ళు నీ గురించే వచ్చేరేమో?' అన్నాడు రహమత్‌ఖాన్.

అవునన్నట్లు తలూపేడు.

"ఇప్పుడేం చేద్దాం?'

"వెనుక వేపు నుండి పారిపోతాను. నాకేం ప్రమాదం లేదు. నువ్వు జాగ్రత్త!"

'నై! సోల్జర్స్ అన్ని వేపులా వున్నారు. ఏ మూల ఎవరి కంట బడినా కుక్కను కాల్చినట్టు కాల్చి పారేస్తారు," అంటుండగానే బయటి నుండి ముఖద్దర్ ఖాన్ గొంతు వినిపించింది.

''దర్వాజ్ ఖోలో!''

రహమత్‌ఖాన్‌కి చెమటలు పట్టేయి. విహారి లేచి నిలబడ్డాడు. వెంటనే విహారిని ప్రక్కగదిలోకి తీసికెళ్ళేడు. నేల మీద చెక్కబల్లలాటిది వుంది. దాన్ని పైకి తీసేడు. "భాయ్! నేను పిలిచే వరకూ యిక్కడ దాక్కో!'' అన్నాడు.

విహారి సరేనన్నాడు.

రహమత్‌ఖాన్ బల్లను మూసేసి, బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటునట్టు, ఆవలింతల్తీస్తున్నట్లు నటిస్తూ వెళ్ళి తలుపు తీసేడు.

ముఖద్దర్ ఖాన్, మరో యిద్దరూ సోల్జర్స్ యింట్లో ప్రవేశించారు.

ముఖద్దర్ ఖాన్‌నీ, సోల్జర్స్‌ని, చూసి షాక్ తిన్నట్లుగా

నటించేడు రహమత్‌ఖాన్.

"ఇండియన్ ఏజంట్ పాకిస్తాన్‌లో అడుగు పెట్టేడు. మాకందిన సమాచారం ప్రకారం అతనీ ప్రాంతాల్లోనే ఎక్కడో వున్నాడు. మీ ఇల్లు సోదాచేయాలి," అన్నాడు ముఖద్దర్‌ఖాన్.

రహమత్‌ఖాన్ అడ్డు తొలగి దారి ఇచ్చాడు. ముఖద్దర్‌ఖాన్ లోనికి నడిచేడు. సోల్జర్స్ లోపల వెదుకుతున్నారు.

విహారివున్న గదిలో మంచం దగ్గర ఆగేడు ముఖద్దర్‌ఖాన్. దుప్పటి నలిగివుంది. అంతవరకూ దానిమీద ఎవరో పడుకున్న ఛాయలు కనిపిస్తున్నాయి.

"దీని పైన పడుకున్నదెవరు?"

'నేనే!' జంకకుండ సమాధాన మిచ్చేడు రహమత్‌ఖాన్, వచ్చిన ఆఫీసర్ ఆవులిస్తే పేగులు లెక్కపెట్టే రకమని అప్పుడే గ్రహించేడు.

ముఖద్దర్‌ఖాన్ తల పంకించేడు. విహారి కాల్చి పడేసిన సిగరెట్టు పీకలు ముఖద్దర్‌ఖాన్ దృష్టిలో పడ్డాయి.

అతని చూపుల్లోని భావం గ్రహించేడు రహమత్‌ఖాన్.

వెంటనే టీపాయ్ మీదున్న సిగరెట్ పాకెట్, అగ్గిపెట్టె తీసి, ఓ సిగరెట్ వెలిగించుకున్నాడు.

ముఖద్దర్‌ఖాన్ మరే ప్రశ్నలూ వేయలేదు.

"ఇండియన్ ఏజంట్ ఒకవేళ ఇక్కడికి వస్తే తెలియజేయండి. లేకపోతే మీరు ప్రమాదంలో పడతారు," హెచ్చరించి తిరుగుమొహం పట్టేడు. సోల్జర్స్ అతన్ని అనుసరించేరు.

మరో పదినిమిషాల తర్వాత, ఆ వీధిలో నుండి ముఖ

ద్దర్ ఖాన్ జీపు కదిలింది. తృప్తిగా వూపిరి విడిచి, గబగబ విహారిని దాచిన సొరంగం దగ్గరికి నడిచేడు.

చెక్కబల్ల తీసి "రా, భాయ్!" అని పిలిచేడు.

విహారి బయటికి వచ్చేడు. జరిగిందంతా చెప్పేడు రహమత్ ఖాన్.

"వెల్ మిస్టర్ విహారీ! సొరంగంలో దాచిపెట్టేడా నిన్ను?" అన్న ముఖద్దర్ ఖాన్ మాటలు వినిపించి చివ్వున తలెత్తి చూసేరిద్దరూ.

తలుపు దగ్గర విలాసంగా నిలబడి రివాల్వర్ చేతిలో వూపుతూ, చిరునవ్వు నవ్వుతూ చూస్తున్నాడు ముఖద్దర్ ఖాన్. అతని వెనుక ఇద్దరు సోల్జర్స్.

రహమత్ ఖాన్ నోట మాట రాలేదు.

విహారి మొహంలో రంగులు మారేయి.

"ఒకేచోట పడివున్న నాలుగైదు సిగరెట్ పీకలను బట్టి, నలిగివున్న దుప్పటిమీద తలగడ ప్రాంతంలోవున్న రక్తపు మరకను బట్టి, యీ యింట్లో ఇంకెవరో వ్యక్తి వుంటున్నాడని వూహించేను. రహమత్ ఖాన్ నుదిటి మీద గాయంలేదు కాబట్టి ఆ మంచం పడుకునేది అతనుకాదని నిర్ధారణ అయింది. అందుకే వెళ్ళినట్టేవెళ్ళి తిరిగొచ్చేను..."

రహమత్ ఖాన్ కి ముచ్చెమటలు పోస్తున్నాయి.

'మిస్టర్ రహమత్ ఖాన్! యిండియా నుంచి వచ్చిన సి.బి.ఐ. ఏజంట్ ఉనికిని గురించి తెలిసీ ప్రభుత్వానికి తెలియజేయక పోవడం ఒక నేరమైతే అధికారులు వెర్రి వేసినపుడు అతన్ని రహస్యంగా దాచిపెట్టడం రెండవ నేరం. ఇవి క్షమించరాని నేరాలు. నీకు శిక్ష తప్పదు," అంటూ రహమత్ ఖాన్ గుండెకి గురిపెట్టి కాల్చేడు.

'ఢాం! ఢాం!!' మని పేలింది ముఖద్దర్ ఖాన్ చేతి లోని రివాల్వర్.

రహమత్ ఖాన్ కెవ్వుమని అరుస్తూ విరుచుకు పడి పోయేడు. కొంతసేపు కాళ్లూ, చేతులు గిలగిల కొట్టుకుని ప్రాణాలు విడిచేడు.

తనవలన ప్రాణాలు పోగొట్టుకున్న రహమత్ ఖాన్ శవంవేపు జాలిగా చూసేడు విహారి. ఆవేశం ముంచు కొస్తున్నా, తప్పించుకునే దారి కనిపించడంలేదు విహారికి.

"విహారీ! తప్పించుకునే ప్రయత్నంచేసి, అనవస రంగా ప్రాణాలు పోగొట్టుకోవద్దు. ఈ యింటికి చుట్టూ సోల్జర్స్ వున్నారు"- అని సంకెళ్లు వేయమన్నట్లు సైని కులకు సైగజేసేడు. ఇద్దరు సోల్జర్స్ గబగబ ముందుకు వచ్చి విహారి చేతులకు సంకెళ్ళు వేసేరు.

'విహారీ! బయటికి నడు. ప్లీజ్, డోంట్ ప్లే ఎనీ ట్రిక్స్!"

విహారి బయటికి నడిచేడు. సోల్జర్స్ అతని వెంట ఎలర్ట్‌గా కదిలారు. రోడ్డుమీద అడుగు పెడుతుండగా విహారి నెత్తిమీద పడింది బలమైన దెబ్బ! కళ్ళముందు చీకటి తెరలు దిగుతుండగా చూసేడు విహారి. ముఖద్దర్ ఖాన్ చేతిలోని యినపరాడ్!

రహమత్ ఖాన్ యింటి చుట్టూ వున్న సోల్జర్స్ పరి గెట్టుకొచ్చి, విహారిని ఎత్తి జీపులో పడేసేరు. ముఖద్దర్ ఖాన్ ఫ్రెంట్ సీట్‌లో కూలబడ్డాడు.

జీప్ కదిలింది.

8

విహారి కళ్ళు తెరిచేడు. నేల మీద అచేతనంగా పడి వున్నాడు. చుట్టూ చూసేడు. ఓమాదిరి వెలుతురు! గదిలో ఒకే ద్వారం వుంది. దాని తలుపులు బంధించబడ్డాయి.

రహమత్‌ఖాన్‌ని కాల్చి చంపడం - తన నెత్తిమీద బరువుగా ఏదో పడడం - తనకు స్పృహ తప్పడం - ఒక్కొక్కటీ గుర్తు రాసాగింది విహారికి.

"మిస్టర్ ఏజంట్ 222 నువ్వు మా దేశంలో తెలుసుకున్న విషయాలేమిటి? ఇండియన్ ఏజంట్స్ మా దేశంలో ఎంతమంది ఉన్నారు ఇంకా ?'

ప్రక్క గదిలోంచి వినిపిస్తున్నాయా మాటలు. అది ముఖద్దర్‌ఖాన్ గొంతు.

ఏజంట్ 222! భారత రాయబారి, తనూ ఊహించినట్లు ఏజంట్ 222ని శత్రువులు బంధించేరా !

ఏజంట్ 222 జవాబు చెప్పలేదేమో, అతని గొంతు వినిపించలేదు.

'మిస్టర్ 222! ఈ రోజు సాయంత్రం వరకు టైమిస్తున్నాను. నేనడిగిన ప్రశ్నలకు సమాధానాలు రాకపోతే, విన్నూ మీ సి.బి.ఐ. ఏజంట్ విహారిని కాల్చిచంపి, యు.ఎన్.ఓ. ముందు నిలబెట్టడం ఖాయమన్నది తెలుసుకో!'

ఆ తర్వాత గది తలుపులు మూసిన చప్పుడు, నలుగురైదుగురు నడిచి వస్తున్న చప్పుడు వినిపించేయి.

నడిచివస్తున్న చప్పుడు క్రమంగా దగ్గరౌతోంది.

తలుపులదగ్గర ఆ శబ్దం ఆగిపోయింది.

మరుక్షణం తలుపులు తెరుచుకుంటున్నట్లు కిర్రు మని చప్పుడైంది.

విహారి చటుక్కున కళ్ళుమూసుకుని పడుకున్నాడు.

తలుపులు తెరుచుకున్నాయ్. గదిలోకి వెలుగు వచ్చింది.

ముఖద్దర్‌ఖాన్, అతని వెంట మరో నలుగురు సోల్జర్స్ గదిలో ప్రవేశించేరు. విహారి ఊపిరి బిగపట్టి పడుకుని వున్నాడు.

'విహారి! ఇక నువ్వు కళ్ళు తెరవ్వచ్చు. నీకింకా స్పృహ రాదనుకునేంత ఫూల్‌ని కాను' అన్నాడు ముఖద్దర్‌ఖాన్.

విహారి గతుక్కుమని కళ్ళు తెరిచేడు.

అందరి చేతుల్లోనూ రివాల్వర్స్ వున్నాయి. అవి విహారి కేసి గురిపెట్టబడి వున్నాయి. ముఖద్దర్‌ఖాన్, సోల్జర్స్ విహారి ముందుకు వచ్చేరు వరుసగా నిలబడ్డారు.

"విహారీ మర్యాదగా అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పు. లేకపోతే నీ చేత ఎలా చెప్పించాలో నాకు బాగా తెలుసు. మొండి కేసే మనుషుల చేత చెప్పించే రాక్షస పద్ధతులెన్నో మా దేశం నేర్పింది మాకు. అవసరమైతే వాటిని ప్రయోగించయినా సరే నీచేత చెప్పిస్తాను," అన్నాడు ముఖద్దర్‌ఖాన్.

విహారి పడుకుని లేవలేదు. "ముఖద్దర్‌ఖాన్! మీ దేశం మీకు హింసించడం మాత్రం నేర్పింది. కాని మా దేశం మాకు హింసల్ని భరించడం కూడా నేర్పింది. నువ్వెన్ని విధాల ప్రయత్నించినా మా చేత ఏమీ చెప్పించ లేవు. నీ అహంకారాన్ని విడిచిపెట్టు."

'నువ్వు చెప్పక పోయినంత మాత్రాన తెల్సుకోలేము అనుకోకు. మీరిద్దరు పాకిస్తాన్ ఎందుకు వచ్చారో తెలిసి పోయింది. ఎన్నివేల మంది వచ్చినా మా "మృత్యు కిరణాలు'' లాంచ్‌ని ఏమీ చేయలేరు. మా ప్రశ్నలకు సమాధానాలు చెప్పక పోయినంత మాత్రాన నష్టం లేదు. మీతో పని పూర్తయింది. సాయంకాలం వరకూ ఆగడం అనవసరం. ఇప్పుడే మిమ్మల్ని పైకి పంపేస్తే సరి.' అనంటూ విహారి గుండెలకు గురిపెట్టేడు ముఖద్దర్‌ఖాన్. మిగిలిన సోల్జర్స్ అదే పని చేసేరు.

విహారి గుండె దడదడ లాడింది. నోటిలో తడారి పోయింది. ఒళ్ళంతా కంపిస్తోంది.

ఒక్క పొర్లింపు పొర్లేడు. ఆ పొర్లింపులో అనూహ్యమైన బలముంది. పొర్లగానే రివాల్వర్ గన్స్ మెరిగేయి. గుళ్ళు నేలను చిల్లు పెట్టేయి. దొర్లుతూనే విహారి ఇంకా బలాన్ని కూడ గట్టుకుని వరుసగా నిలబడ్డ ప్రత్యర్థుల కాళ్ళను భయంకరంగా ఢీకొట్టు కున్నాడు.

రోడ్ రోలర్ కుమ్మినట్లయింది. నలుగురూ తూలి పడ్డారు. ఆ అదును చాలు. ప్రత్యర్థులు రివాల్వర్స్ పేల్చే అవకాశమీయకుండా స్ప్రింగ్‌లా లేచాడు. లేచినదే తడవు వారి చేతుల్లోని ఆయుధాలని ఎగరకొట్టేశాడు. ముఖద్దర్‌ఖాన్ మొహంలో రంగులు మారిపోతున్నాయి. ఏం జరుగుతుందో అర్థం గాకముందే విహారి అతని మీదకు దూకేడు.

ముఖద్దర్‌ఖాన్ వెనుకంజ వేయలేదు. చటుక్కున లేచి విహారిని ఎదుర్కొన్నాడు.

పిడికిలిబిగించి ముఖద్దర్‌ఖాన్ డొక్కలో పొడిచేడు విహారి.

ముఖద్దర్‌ఖాన్ ప్రేవులు తెగినంత బాధ కలిగింది. అతని మొహంలో బాధ స్పష్టంగా కనిపించింది విహారికి.

అంతలో సోల్జర్స్ తేరుకుని విహారిమీదకు దూకేరు.

నలుగురిని ఒకేసారి ఎదుర్కోవడం సామాన్యం కాదు. నలుగురూ దృఢమైన వాళ్ళు. కండలు తిరిగిన శరీరాలు. తనకింకా పూర్తిగా ఆరోగ్యం చిక్కలేదు. నీరసం ముంచుకొస్తోంది.

ఇక లాభం లేదనుకుని, ఆవేశంగా పిడికిలి బిగించి గడ్డంక్రింద ఒక్కటిచ్చేడొక సోల్జర్‌కి. కెవ్వుమని అరుస్తూ వెల్లకిలా పడిపోయేడు.

మరొకడి పొట్టలో గుద్దేడు. దాంతో ఉండచుట్టుకు పోయేడు. రెట్టించిన కోపోద్రేకంతో తన మీదకొస్తున్న ముఖద్దర్‌ఖాన్ మొహంమీద అరచేత్తో చరిచేడు బలంగా। ముఖద్దర్‌ఖాన్ తల గోడకు గుద్దుకుని తల చిట్లి రక్తం కారసాగింది. మరుక్షణంలోనే అతనికి స్పృహ తప్పింది.

ఓ సోల్జర్‌ని రెండుచేతులతో పైకెత్తి అప్పుడే లేవ బోతున్న ఇద్దరి సోల్జర్స్ మీదకి విసిరేసేడు. ముగ్గురుకీ నడుములు విరిగినంత పనయింది. చకచక ముగ్గురి మెడ నరాలమీద దెబ్బతీసి స్పృహ తప్పించేడు.

తర్వాత గదిలో నుండి బయటకు పరిగెత్తి తలుపు మూసి గొళ్ళెం పెట్టేసేడు. ఏజంట్ 222 ని బంధించిన గదికేసి పరిగెత్తేడు

ఇనపచువ్వల తలుపులు బలంగా వున్నాయి. లాక్ ఎక్కడుందో కనిపించడం లేదు. భుజాలతో ఢీ కొడితే

విరిగే తలుపల్లా లేవు.

'మిస్టర్ ఏజంట్ 222 ! నా పేరు విహారి. ఇండియా నుండి వచ్చేను' అన్నాడు తలుపుల ముందు నిలబడి.

ఏజంట్ 222 కళ్ళు ఆనందంతో మెరిసేయి.

అతను విహారి దగ్గరకు పరిగెత్తుకొచ్చాడు.

'మిమ్మల్ని విడిపించాలనివుంది. కానీ....'

'ఇవి ఆటోమేటిక్ డోర్స్. నా అనుమానం ప్రకారం ఎక్కడో స్విచ్ వుంటుంది. ప్రయత్నిస్తే...." అప్పుడే విహారి కళ్లు అన్ని గోడలూ వెదికేస్తున్నాయి గోడపైన ఓ ఇనుపరేకు తగిలుంది. ఆ రేకును పైకెత్తి చూసేడు ఏజంట్ 222 వూహ కరక్టు, స్విచ్ వుంది.

విహారి స్విచ్ నొక్కేడు. ఏజంట్ 222 వున్న గది తలుపుపైకి వెళ్ళిపోయింది. ఏజంట్ 222 బయటి కొచ్చేడు ఉత్సాహంగా!

"బ్రదర్! నువ్వెలా పట్టుబడ్డావ్ వీళ్ళకి?" అడిగాడు విహారి.

'మీరు పాకిస్తాన్ వస్తున్నవార్త విని చాలా సంతోషించేను. మీరు వచ్చేలోపలే మృత్యుకిరణాలు' లాబ్ గురించి పూర్తివివరాలు సేకరించి మీకివ్వాలని నిర్ణయించుకున్నాను. వెంటనే రంగంలోనికి దిగేను. మృత్యుకిరణాల లేబరేటరీ ఎక్కడుంటుందో తెలుసుకో గలిగాను.'

'ఎక్కడ?'

"కారకోరమ్ హైవే మీకు తెలిసేవుంటుంది. ఆ హైవే మీద అఫ్ఘనిస్తాన్ సరిహద్దుకు ఏభై కిలోమీటర్ల దూరంలో అడవుల మధ్య వుంది లేబరేటరీ దానిచుట్టూ ఎత్తైన

బౌండ్రీ. లోపల ప్రవేశించాలని నేను చేసిన ప్రయత్నం ఫలించలేదు. బౌండ్రీలో అడుగు పెట్టిన మరుక్షణం సోల్జర్స్ తుపాకులతో సహా ప్రత్యక్షమయ్యేరు. మరి కొన్ని నిమిషాలకు ముఖద్దర్ ఖాన్ రావడం, నన్నిక్కడ బంధించడం జరిగింది," అని చెప్పేడు ఏజంట్ 222.

'బౌండ్రీ దాటి లోనికెవరు అడుగు పెట్టినా, వాళ్ళ రూపం లోపల స్క్రీన్ మీద కనిపించే ఏర్పాటు చేసి వుంటారు. అందుకే నిన్ను వెంటనే సోల్జర్స్ చుట్టు ముట్టేరు.'

'అయితే మన మిప్పుడేం చేద్దాం? సాహసంగా 'లాబ్' లో ప్రవేశిస్తామా?' అడిగేడు ఏజంట్ 222.

'సాహసిస్తే తుపాకి తూటాలతో మన ఒళ్ళు తూట్లు పడడం మినహా మరేం జరగదు. యిప్పుడు మనకా్కవలసింది ఉపాయం. నాకో ఉపాయం కనిపిస్తోంది. కాని...." సందేహించేడు.

'ఏమిటది?'

"ముఖద్దర్ ఖాన్‌కి స్పృహ రాగానే నేను నిన్ను విడిపించుకు పోయిన సంగతి గ్రహిస్తాడు. నీ ద్వారా 'మృత్యుకిరణాలు' లేబరేటరీ గురించి నేను తెలుసుకుంటాననీ వూహిస్తాడు. అ వెంటనే తన వాహనంలో బయల్దేరి లేబరేటరీకి వెళ్ళి అందర్నీ హెచ్చరిస్తాడు. పటిష్టమైన కట్టుదిట్టాలు ఏర్పాటు చేస్తాడు. అందుకని నేను అతని కారు డిక్కీలో దాక్కొని అతనితో లేబరేటరీకి వెళ్తాను. నీవు ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దు దాటి ...." అంటూ ఏదో చెప్పాడు.

9

అరగంట తర్వాత స్పృహవచ్చింది ముఖద్దర్ ఖాన్‌కి.

"ఎక్కడ? వాడెక్కడ?" అంటూ రంకెలు వేస్తూ లేచేడు. తన చుట్టూ స్పృహతప్పి పడివున్న సోల్జర్స్‌ని చూసేక పరిస్థితి సూచాయగా అర్థమైంది. ఏజంట్ 222ని విడిపించుకు పోయేదని తెలిసేక గుండె గుభేల్‌మంది.

ముఖద్దర్ ఖాన్ మస్తిష్కంలో ఆలోచనలు బయలు దేరాయి. విహారి అఖండుడు. అత్యంత ప్రతిభాశాలి. ఎటువంటి క్లిష్టమైన పనయినా అవలీలగా చేసుకుపోగలిగే ధీశాలి. ఏజంట్ 222 ని లేబరేటరి వివరాలడిగి తెలుసుకుంటాడు. దాన్ని నాశనం చేయదానికి యిద్దరూ బయలుదేరి వుంటారు.

అయినా వాళ్ళు లోపల ప్రవేశించడం అంత సులభం కాదు. దారిలో ఎన్నో చెక్‌పోస్టులున్నాయి. ఎక్కడో ఒకచోట పట్టుబడిపోతారు. ఏదేమైనా, తను బయల్దేరాలి.

గబ గబ బయటికి నడిచేడు. కారిడార్ మెట్లు దిగువన కారు కనిపించింది.

కారెక్కి స్టార్ట్‌చేసి బయటికి దూకించేడు ముఖద్దర్ ఖాన్.

రోడ్డును మింగేస్తూ రెండు చెక్‌పోస్ట్‌లను దాటి పోయింది కారు. కారులో వున్నది ముఖద్దర్‌ఖాన్ కావడం వల్ల చెక్‌పోస్ట్‌లోని అధికారులు కారుని ఆపే ప్రయత్నం చేయలేదు.

మూడవ చెక్‌పోస్టు దగ్గర గేటువేసి వుండడంతో కారాపక తప్పిందికాదు ముఖద్దర్‌ఖాన్‌కి.

కారు దగ్గరికి పరిగెత్తుకొచ్చి లోనికి చూసేడు అధికారి. "నంబర్ప్లీజ్" అడిగేడు.

"అన్నీ అంకెలూ మనవే!" చెప్పేడు ముఖద్దర్ఖాన్.

"సారీ సార్ !" వెనక్కి తప్పుకున్నాడు. గేటు పైకి లేచింది.

కారు రయ్ మని దూసుకు పోయింది.

లాబరేటరీ గేటు ముందు కారుని ఆపేరు మళ్ళీ. మొదటి మూడు చెక్పోస్టుల దగ్గరకంటే సెక్యూరిటీ గార్డ్సు ఎక్కువ వున్నారక్కడ.

ఒక అధికారి పరిగెట్టుకు వచ్చి "కోడ్ వర్డ్ ప్లీజ్" అని అడిగేడు.

'మృత్యుకిరణాలే మా ఆయుధం!' చెప్పేడు ముఖద్దర్ఖాన్

'జీ సాబ్!' అని గేటుతెరవమని సైగజేసేడు.

గేటులేచింది. కారు తిన్నగాలోనికి దూసుకుపోయింది. ముఖద్దర్ఖాన్ కారుదిగి చకచక లాబరేటరీవేపు అడుగులేసేడు.

లాబ్లో ప్రతి ఒక్కరి సెల్యూట్ అందుకుంటూ వెళ్ళి డైరక్టర్ని కలుసుకున్నాడు.

'హలో డైరక్టర్ సాబ్! మన పరిశోధనలు ఎంతవరకు వచ్చేయి?' అడిగేడు అతన్ని కలుసుకున్నాక.

'ఈ రోజుతో మన పరిశోధనలు ముగిసినట్టే. మన ప్రయోగాలు ఫలించేయి. ఈ సారి విజయం మనదే. కాశ్మీర్, దానితోపాటు భారతదేశం మన పరంగాక తప్పదు."

'థాంక్యూ డైరక్టర్! బై ది పై, ఇద్దరు యిండియన్

ఏజెంట్స్ పాకిస్తాన్‌లో అడుగు పెట్టేరు. ఈ లేబరేటరీని నాశనం చేయడమే వారి ధ్యేయం!'

'మైగాడ్!' అదిరిపడ్డాడు.

'గనుక సెక్యూరిటీ బలగాన్ని అప్రమత్తతో వ్యవహరించమనండి. అనుక్షణం రక్షణఏర్పాట్లును సరి చూసుకోవాలి. బి కేర్ ఫుల్!'

తలూపేడు డైరక్టర్.

బయటికి నడిచేడు ముఖ్దర్ ఖాన్. లేబరేటరీ అంతా ఓసారి తిరిగి కట్టుదిట్టమైన ఏర్పాట్లుచేసి, సెక్యూరిటీ గార్డ్స్‌ని గట్టిగా హెచ్చరించి కారెక్కేడు.

ముఖ్దర్ ఖాన్ కారు కనిపించడంతో గేటులేచింది.

కారు బయటికి దూసుకుపోయింది.

10

ముఖ్దర్ ఖాన్ కారు డిక్కీలో దాగి లేబరేటరీ చేరుకున్న విహారీ, అతను వెళ్ళి పోగానే చటుక్కున డైరెక్టర్ గదిలోకి దూకి అతని పీక పట్టుకున్నాడు.

విహారి చేతిలో విల విల లాడిపోయేడు డైరక్టర్. గింజుకుంటూ విడిపించుకోవాలని ప్రయత్నిస్తున్నాడు.

విహారి అరచేయి చాచి మెడ నరాల మీద కొట్టేడు బలంగా! కిక్కురు మనకుండా తల వాల్చేసేడు డైరక్టర్.

అతన్ని రివాల్వింగ్ ఛెయిర్లో సరిగ్గా కూర్చోబెట్టేడు. ఎవరేనా అతన్ని చూస్తే కుర్చీలో కూర్చుని నిద్ర తీస్తున్నాడనుకుంటారు.

ఫోన్ మ్రోగింది. అప్రయత్నంగారిసీవరందుకున్నాడు.

"నమస్తే సర్! ఈరోజుతో మా పరిశోధనలు ముగిశాయి. యికనైనా మేము మా యిళ్ళకు పోవచ్చా?"

అన్నది అవతల కంఠం.

అతను మృత్యుకిరణాలు పరిశోధకుల్లో ఒకడని గ్రహించిన విహారికి ఓ ఆలోచన వచ్చింది.

'మిస్టర్! లేబరేటరీలో టైమ్ బాంబు పెట్టేరెవరో. లోపలున్న వాళ్ళందర్నీ బయటికి పరిగెత్తమను. హరి యప్!" అరిచేడు విహారి ఫోన్‌లో.

క్షణంలో బిలబిల మంటు మనుషులు లోపల్నుండి రాసాగేరు. విహారి అందర్నీ తప్పించుకుని వెళ్ళి, ఎవరూ చూడకుండా టైమ్ బాంబ్‌లు ఐదు నిమిషాల్లో పేలేట్టు లేబరేటరీలో ఎరేంజ్ చేసి బయటికొచ్చేరు.

'హేండ్సప్!"

గిర్రున తిరిగేడు విహారి.

ముఖద్దర్‌ఖాన్!!! అతను అంత తొందరగా తిరి గొస్తాడని వూహించలేదు.

అతని చేతిలో రివాల్వర్ నిగనిగ లాడుతూ మెరు స్తోంది.

విహారి ఆలస్యం చేయ దలచుకోలేదు. స్పీడుగా కాళ్ళు ఝాడించేడు. ముఖద్దర్‌ఖాన్ కడుపులో తగిలిందా దెబ్బ. మూడడుగుల దూరంలో పడ్డాడా దెబ్బకి.

కోలాహలం వినిపించింది. తలెత్తిచూసేడు. సోల్జర్స్ మిషన్‌గన్స్‌తో రంగంలోనికి దిగేరు. విహారి పరిగెత్తేడు.

పదడుగుల దూరంలో ఒక మిలటరీ జీప్ ఆగివుంది. జీప్‌లో ఎవరూ లేరు. చంగున దూకి, జీప్ స్టార్టుచేసేడు. ముందుకు వురికించేడు.

వెనుక సోల్జర్స్ పరిగెత్తు కొస్తుండడం గమనించేడు విహారి.

చుక్ .... చుక్ .... చుక్ ....

మిషిన్ గన్స్ ప్రేలు తున్నాయి.

జీప్‌వి రాచుకుంటూ పోతున్నాయి బులెట్స్.

జీప్ వేగాన్నందుకుంది.

ఎదురుపడిన సోల్జర్స్‌వి కాల్చి పారేస్తున్నాడు. గేటు విరిగిపడింది, మిలటరీ జీప్ బలానికి.

జీప్ గేటు దాటుతుండగా కళ్ళు మిరుమిట్లు గొలిపే వెలుగు కనిపించింది విహారికి. లేబరేటరీ వుండే ప్రదేశంలో మంటలు ఆకాశాన్నంటుతూ లేచాయి. ప్రేలుళ్ళు పెద్దగా వినిపిస్తున్నాయి.

విహారి వెనుకనే మరో రెండు జీప్‌లు వెంటపడ్డవి.

విహారి జీప్‌ని వేగంగా నడుపుతున్నాడు. అది అంతా అడవిప్రదేశం. రోడ్ చాలా బాగుంది. జీప్ వురకలు తీస్తూ పరిగెత్తుతోంది.

చుక్ .... చుక్ .... చుక్ ....

వెనుక జీపుల్లో నుండి మిషన్‌గన్స్ ప్రేలుస్తున్నారు సోల్జర్స్.

'అమ్మో!' విహారి జబ్బలో బుల్లెట్ దిగింది. నిప్పు కణం పెట్టి కాల్చినట్టుగా వుంది. రక్తస్రావం అవుతోంది. నీరసం ముంచుకొస్తోంది.

అయినా లెక్కచేయడం లేదు విహారి. జీప్‌ని ఆఫ్ఘనిస్తాన్ బోర్డర్ వేపు పరిగెత్తిస్తున్నాడు.

బోర్డర్ దగ్గర పడింది.

అంతలో ఏదో చప్పుడు వినిపించింది. గిరగిర తిరిగే ప్రొపెల్లర్స్ గాలిని చీలుస్తున్న చప్పుడు. హెలికాప్టర్ ఎగురుతున్నపుడు వినపడే శబ్దం. విహారిలో నూతనో

త్సాహం కలిగింది.

. చటుక్కున తల పైకెత్తి ఆకాశంలోకి చూసేడు. హెలికాప్టర్ జీప్‌తో పాటే వస్తోంది. దానిమీద యిండియన్ ఎయిర్ ఫోర్స్ గుర్తులు కనిపిస్తున్నాయి.

'కమాన్ బ్రదర్!' హెలికాప్టర్‌లోనుండి తలబయటకు పెట్టి అరిచేడు ఏజంట్ 222.

విహారికి వెర్రిగా అరవాలనిపించింది. పిచ్చిగా ఆనందం కలిగింది.

హెలికాప్టర్‌లో నుంచి త్రాటి నిచ్చెన దిగ సాగింది జీప్‌లోకి.

వెనుక మిషిన్ గన్స్ నిర్విరామంగా ప్రేలుతున్నాయి.

త్రాటి నిచ్చెన చాలా కిందకి దిగింది. విహారి జీప్ స్టీరింగ్ కంట్రోల్ చేస్తూనే నిచ్చెన అందుకున్నాడు.

మరుక్షణము హెలికాప్టర్ వేగాన్ని పుంజుకుంది.

మిలటరి జీప్ తిన్నగా వెళ్ళి ఓ చెట్టును గుద్దుకుని ఆగిపోయింది.

చుక్ ....చుక్ ....చుక్ ....

మిషీన్ గన్స్ హెలికాప్టర్ నిచ్చెనకు వేలాడుతున్న విహారి వేపు తిరిగేయి. కాని అప్పటికే హెలికాప్టర్ మిషిన్ గన్స్ రేంజికి అందనంత ఎత్తుకు వెళ్ళిపోయింది.

మెల్లగా హెలికాప్టర్ లోనికి చేరుకున్నాడు విహారి. అతని కళ్ళు మగతగా మూత బడుతున్నాయి.

విహంగంలా ఎగురుతూ ఢిల్లీ వేపు పయనించ సాగింది హెలికాప్టర్.

(ఐపోయింది)